క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని 6వ టౌన్ ఎస్సై రమేష్ సూచించారు. మండలంలోని సారంగాపూర్ బీఈడీ కళాశాలలో సోమవారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తెలియని మొబైల్ లింకులను అనవసరంగా క్లిక్ చేయవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు అకౌంట్ సంబంధించిన సమాచారం, సీవీవీ, ఓటీపీ లాంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితులలోనూ ఎవ్వరికి తెలపవద్దన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల కో–ఆర్డినేటర్ వన్నెల్‌దాస్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్, అధ్యాపకులు పోలపల్లి, సువర్చల, పోలపల్లి శ్రీకాంత్, హరిత, నరేందర్, పోశెట్టి, నరసింహారెడ్డి, సుజ్రిత్, ప్రసాద్, శశి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ భవనంలో సోమవారం జర్నలిస్టు ప్రభీర్ ప్రోకాయిస్త రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ప్రముఖ న్యాయవాది మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు గొర్రెపాటి మాధవరావు ఆవిష్కరించారు. నాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నుంచి నేటి అప్రకటిత మోదీ ఎమర్జెన్సీ వరకు జరిగిన పరిణామాలను విశ్లేషిస్తూ పుస్తకాన్ని రాశారని వక్తలు పేర్కొన్నారు. ట్రస్ట్ కార్యదర్శి రామ్మోహన్‌రావు, రవీంద్రనాథ్‌సూరి, హుస్సేన్, ఈవీఎల్ నారాయణ, బన్సీలాల్ రాజేంద్ర, ప్రసాద్‌రావు, నూర్జహాన్, సిర్ప లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని నాగారం ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో డెంటల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్యులు దంత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైద్యుడు వినోద్ కుమార్ విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్‌సయ్యద్ జాయినాబ్, రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ప్రాజెక్ట్ చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టేందుకు సహకరించాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ తండాలో సోమవారం జిల్లా బాలల పరిరక్షణ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక చట్టం, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం, 1098 చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్రాజెక్టర్ ఏర్పాటు చేసి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం చైతన్యకుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహం చేస్తే వెంటనే పోలీసులకు, తమకు ఫోన్ చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఎస్సై రమేష్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా, పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్లు, పోలీస్, చైల్డ్ లైన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రుద్రూర్: వర్ని మండలం శ్యాంరావ్ తండాలోని ఒక కిరాణ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు లీటర్ల మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.4,785 ఉంటుందని వారు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

బాల్కొండ: జలాల్‌పూర్‌లో ఉపాధి హామీ పనులను బాల్కొండ ఏపీవో ఇందిరా సోమవారం పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది ధనుంజయ్, అనిల్ ఉన్నారు.

నిర్మించి వదిలేశారు

- నగరంలో నిరుపయోగంగా మారిన వీధివ్యాపారుల సముదాయం
- పట్టించుకోని అధికారులు



నాందేవ్‌వాడలో నిరుపయోగంగా మారిన షెడ్లు

నిజామాబాద్‌నాగారం: నగరంలో వీధివ్యాపారుల సౌకర్యార్థం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. రోడ్ల మీద వ్యాపారం చేయకుండా వీధి వ్యాపారుల కోసం ప్రభుత్వ నిధులతో గతంలో నగరంలో రెండు చోట్ల షెడ్లు నిర్మించారు. కానీ కొన్ని నెలలుగా ఇందులో వ్యాపార క్రయవిక్రయాలు జరుగకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అలాగే పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు ఎవరికి వారు తమకేమీపట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రారంభించిన కొన్ని రోజులకే..

నగరంలో వీధి వ్యాపారుల కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వీధివ్యాపారుల వర్తక సముదాయం (స్ట్రీట్ వీండర్స్) రెండు చోట్ల నిర్మించారు. నాందేవ్‌వాడ (జోన్–1) కార్యాలయం పక్కన, ఉషాప్రసాద్ థియేటర్ వెనుక భాగంలో సుమారు ఏడాది క్రితమే నిర్మించారు. ఒక్కో సముదాయానికి సుమారుగా రూ. 10లక్షల వరకు నిధులు వెచ్చించి మరీ నిర్మాణం పూర్తి చేశారు. నిర్మించిన కొద్ది రోజులకే వీటిని ప్రారంభించారు. నగరంలో రోడ్ల మీద కూరగాయాలు అమ్మకుండా ఈ కేంద్రాల్లో ఉచితంగా కూర్చుకొని క్రయవిక్రయాలు జరుపుకోవడానికి అవకాశం కల్పించారు. వారం రోజులు మాత్రం సంబంధిత అధికారులు నానా హడావిడి చేసి రోడ్ల మీద కూరగాయలు, పండ్లు అమ్మేవారికి అవగాహన కల్పించి ఇందులోకి పంపించారు. ఉదయం ఇందులో కూరగాయలు, పండ్లు అమ్ముకొని సాయంత్రం వెళ్లాలి. కానీ ఎలాంటి సౌకర్యాలు లేవని, నీరు, షెల్టర్లు లేవని అందులోకి వెళ్లడానికి వ్యాపారులు వెనుకంజ వేశారు. దీంతో గత ఏడాదిగా ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు షెటర్లు నిర్మించాలని, గేట్లు ఏర్పాటు చేయించాలని, ఒక్కొక్కరికి ఒక్కో షెడ్డు కేటాయించాలంటు సంబంధిత అధికారులను ఒత్తిడి చేశారని పలువురు పేర్కొంటున్నారు. సముదాయాలను మెప్మాకు సంబంధించిన అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో దుకాణసముదాయలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి దుకాణసముదాయాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీ అర్వింద్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు







డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి.. సిరికొండలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు.. ఇందూరు తిరుమలలో జీవన్‌రెడ్డి, భూపతిరెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

- బాజిరెడ్డి గోవర్ధన్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు..
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

డిచ్‌పల్లి/నిజామాబాద్‌రూరల్/సిరికొండ/ధర్పల్లి/మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఐదు సంవత్సరాలు ఎలాంటి అభివృద్ధి చేయని ఎంపీ అర్వింద్‌కు ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే అర్హత లేదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు మండలాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ధర్పల్లి మండల కేంద్రంలో, డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సిరికొండ మండల కేంద్రంలో పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ ప్రధాని నరేంద్ర మోదీతో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయించి ఆ బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఇప్పటికీ చెప్పడం లేదన్నారు. రెండు పర్యాయాలు రూరల్ ఎమ్మెల్యేగా గెలిచిన బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే జూన్ నాటికి జిల్లాలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసి గల్ఫ్‌లో మృతి చెందిన వారికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో దేశమంతటా కాంగ్రెస్ గాలి వీస్తోందని, అధికారంలోకి రావడం ఖాయమని. రాహుల్ గాంధీ ప్రధాని కానున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం 21 ప్యాకేజీ ద్వారా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సాగునీరు అందిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

సిరికొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. లింగారెడ్డి, గౌస్, దేవేందర్‌రెడ్డి, మహిపాల్, సలావుద్దీన్, సతీష్‌గౌడ్, జగన్‌తోపాటు వందలాది మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరికి జీవన్‌రెడ్డి, భూపతిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇందూరు తిరుమలలో ప్రత్యేక పూజలు..

మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జీవన్‌రెడ్డిని వేద పండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, గడీల రాములు, శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, అమృతాపూర్ గంగాధర్, తారాచంద్ నాయక్, గడీల శ్రీరాములు, వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యాంసన్, రాజేశ్వర్, సాయిబాబా, మురళి, సోమ్‌నాథ్, బాబా, ఇర్ఫాన్, బాకారం రవి, బాలనర్సయ్య, ఎర్రన్న, సొసైటీ చైర్మన్లు గంగాధర్, రాములునాయక్, భూషణ్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, దేగాం సాయన్న, మునిపల్లి సాయిరెడ్డి, ఆర్మూర్ బాలరాజ్, చెలిమెల నర్సయ్య, కెతావత్ యాదగిరి, ఎల్లోల సాయిరెడ్డి, భోజన్న, మీసాల సుధాకర్‌రావు, సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, బున్నె రవి, గుత్ప రఘు, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

పసుపు మద్దతు ధర కోసం పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖలీల్‌వాడి: పసుపు బోర్డు, పసుపునకు మద్దతు ధర కోసం పోరాడుదామని రైతు జేఏసీ కన్వీనర్ ప్రభాకర్, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో సోమవారం రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆర్మూర్ డివిజన్ కమిటీ, రైతు ఐక్యవేదిక ఉమ్మడి జగిత్యాల జిల్లా కమిటీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అబద్ధాల్లో ఆరితేరిన ఎంపీ అర్వింద్ ప్రధాని నోటితో కూడా అబద్ధాలు ఆడించి పసుపు బోర్డుపై అబద్ధపు ప్రకటన చేయించారన్నారు. ఈ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన బాధ్యత రైతులపై ఉన్నదన్నారు. రైతులను మోసం చేసిన నేతలకు ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. నాయకులు దేవారం, సూర్భ్యాల లింగారెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణ, యాదగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగారాం, పాపయ్య, బాబన్న, లింబాద్రి, దామోదర్, సర్పంచ్ సాయిలు తదితరులున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని టీఎస్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు జరీన ఫిర్దోస్(48) గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి ఉపాధ్యాయులు సోమవారం తెలిపారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో బాధపడగా కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ సోమవారం గుండెపోటుతో మృతి చెందారన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ఆర్మూర్‌టౌన్: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కొక్కెర భూమన్న పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే ప్రధాని లక్షల మంది మాదిగల మధ్య వర్గీకరణ చేస్తామని ప్రకటించి, కమిటీ పేరున కాలయాపన చేస్తున్నారని అన్నారు. నేతలు ఎల్‌టీ కమార స్వామి, కూరగాయల స్వామి, మేతరి సాయన్న, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి సన్మానం



బాజిరెడ్డిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అఖిల భారత భక్త మార్కండేయ నిజామాబాద్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కోటగల్లిలోని భక్త మార్కండేయ మందిరంలో స్వామివారికి సోమవారం బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జరగబోయే ఎంపీ ఎన్నికల్లో పట్టణ పద్మశాలి సంఘ సభ్యులందరూ బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనను సన్మానించారు. జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి, పట్టణ అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్ ఆర్టీసీ డిపోలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆర్మూర్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌టౌన్(బోధన్): అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక కేంద్రం అధికారి గంగాదాస్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అ వగాహన సదస్సులు నిర్వహించారు. ఆర్టీసీ డిపో లోని ఉద్యోగులకు, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు, రైల్వే స్టేషన్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివ రించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశా రు. సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, వారిస్ అహ్మద్, రషీద్, సాయిలు, రాజశేఖర్, మోసిన్ ఖాన్ ఉన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్ చౌరస్తా వద్ద జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా ఆస్పత్రులు, బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రదామాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.

నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో వివేకానంద చౌరస్తా వద్ద సోమవారం అగ్నిమాపక సిబ్బంది తమ సేవలను వివరిస్తూ ప్రదర్శనలు చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో నందిపేట ఫైర్‌స్టేషన్ ఫైర్‌మెన్లు మధుకర్, సుధాకర్, సూరజ్, డ్రైవర్ ఎండీ షఫీ, హోంగార్డు పి.రఘు, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలో స్థానిక ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో అగ్ని మాపక వారోత్సవాలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీలపై ప్రభుత్వ దాడులు ఆపాలి



మాట్లాడుతున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీలపై ప్రభుత్వం దాడులను వెంటనే ఆపాలని పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రాజు తెలిపారు. నగరంలో సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీ సభ్యుల సేవలు వెలకట్టలేనివన్నారు. ఐఎంఏ సభ్యులు ఆరోపణలు చేయడం వల్లే రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధికారులు పీఎంపీ సభ్యులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఒకరు ఇద్దరు చేసిన తప్పులకు వ్యవస్థని తప్పుపట్టడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంఘ ప్రతినిధులు సత్యపాల్, రాష్ట్ర కోశాధికారి సాంబశివరావు, భోజన పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘు ప్రతినిధులు

సుభాష్‌నగర్: వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, హక్కుల పరిరక్షణకు ప్రతి జిల్లా కేంద్రంలో వినియోగ దారుల కమిషన్లు (కోర్టులు) పనిచేస్తున్నాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. నగరంలో సోమవారం వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'వినియోగదారుల హక్కులు, బాధ్యతలు'పై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం మానస వినియోగదారుల హక్కులను తెలిపే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి వ్యక్తి మరణించే వరకు వినియోగదారుడిగా పరిగణిస్తారని, ఈక్రమంలో వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం అందరికీ సంక్రమించిన ఆరు హక్కులు వినియోగించుకోవాలన్నారు. వస్తు సేవలపై పూర్తి సమాచారం పొందే హక్కు, వస్తు సేవలను ఎంపిక చేసుకునే హక్కు, పూర్తి రక్షణ పొందే హక్కు, తగిన నష్టపరిహారం పొందే హక్కు, విధాన నిర్ణయాల్లో ప్రాతినిధ్యం వహించే హక్కు, వినియోగదారుల విద్యను పొందే హక్కులపై చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహదేవుని శ్రీనివాస్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా గోపూజ



నిజామాబాద్ సిటీ: నగరంలోని కోదండ రామాలయంలో సోమవారం గోకుల్ గోసేవా సమితి ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ రామనవమి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు గోపూజ, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రాంమ్మోహన్, మూఢ నాగభూషణం గుప్తా, మోటూరి మురళీ, టీఎస్ వ్యాస్ రాజశేఖర్, శంకర్, మూఢ శ్రీనివాస్, పాపిని సతీష్, అరుణ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన



బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలోని ఒంటి హనుమాన్ ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేసి అన్న ప్రసాదాలను వితరణ చేశారు.

రైతు సమాచారం

నేడు రైతులకు అవగాహన సదస్సు

డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ రైతు వేదిక భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 'భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించుటకు పాటించాల్సిన సూచనలు, వరి కోసిన తర్వాత మిగిలిన మొళ్లను నేలలో కలియదున్నుట వల్ల కలిగే లాభాలు' అనే అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	76,000	వెండి (కిలో)	88,000
22 క్యారెట్స్	70,115	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	60	పచ్చిమిర్చి	50	70
జీరకాయ	45	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
జిర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	35	60
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	45	60
పుదీనా	35	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			- సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	గీతాంజలి మళ్లీ వచ్చింది-10.40 టిల్లు స్క్వేర్(తెలుగు)- 1.30. ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 4.20. 7.30
స్క్రీన్-2	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 11.00. గీతాంజలి మళ్లీ వచ్చింది (తెలుగు) - 1.30. 7.35 బడే మియా చోటే మియా (హిందీ)-4.30. 10.25
స్క్రీన్-3	మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.40. 4.30. 7.40. 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మైదాన్ (హిందీ)- 9.15. ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 1.05. 10.30 టిల్లు స్క్వేర్(తెలుగు)- 4.30. 7.30
స్క్రీన్-2	బడే మియా చోటే మియా- 10.00. 7.05. గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ)- 1.30. గీతాంజలి మళ్లీ వచ్చింది - 4.05 బడే మియా చోటే మియా (3డీ హిందీ)- 10.35
స్క్రీన్-3	లవ్‌గురు(తెలుగు)-10.15. 7.15. మంజుమ్మల్ బాయ్స్- 1.25. 4.20. గీతాంజలి మళ్లీ వచ్చింది -10.25
స్క్రీన్-4	మైదాన్ (హిందీ)- 12.00. మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 3.50. 6.35. లవ్ గురు (తెలుగు)-10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	బడే మియా చోటే మియా (హిందీ) - 11.00 6.00. మైదాన్ (హిందీ)- 2.00 6.00
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	గీతాంజలి మళ్లీ వచ్చింది(తెలుగు)